క్లుప్తంగా

23న వైకుంఠ ద్వార దర్శనం

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లను వైకుంఠ ద్వారం ద్వారా దర్శనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవర్ల దర్శనం తెల్లవారు జామున 4 గంటల నుంచి ఉంటుందని, 5.00 గంటల నుంచి వైకుంఠ (ఉత్తర) ద్వారం ద్వారా విశేష అలంకారంలోని స్వామి, అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎప్పటిలాగా ఉదయం 11.00 గంటల వరకు మాత్రమే దర్శనాలను నిలిపి వేయకుండానే ఈ ఏడాది మధ్యాహ్నం 1 గంట వరకు దర్శనాలకు అవకాశం కల్పిస్తామని వివరించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బ్యాంకు ఆర్‌ఎం మురళీమోహన్ తెలిపారు. బుధవారం నగరంలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆర్‌ఎం ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ దేవదాస్, డివిజనల్ మేనేజర్ రాజశేఖర్, సీనియర్ మేనేజర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎరుకల సేవా సంఘం కార్యదర్శిగా కేద్రి వెంకట రమణను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వెంకట రమణ రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారన్నారు. కడప నగరంలోని తారక రామ నగర్‌కు చెందిన ఆయన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎస్టీ విభాగంలో పనిచేస్తున్నారు.

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం

కడప ఎడ్యుకేషన్ : ఐటీఐలలో 2 సంవత్సరాల వ్యవధి గల కోర్సులను 60 శాతం మార్కులతో పాసైన అభ్యర్థులకు పాలిటెక్నిక్‌లో 2వ సంవత్సరంలో ప్రవేశం పొందుటకు బ్రిడ్జి కోర్సులలో అడ్మిషన్స్ పొందవచ్చని ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ ప్రధానాచార్యులు జ్ఞానకుమార్ తెలిపారు. బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు స్టేట్ టెక్నికల్ బోర్డు నిర్వహించే ప్రవేశ పరీక్షలు రాయుటకు అర్హులన్నారు. వివరాలకు 9989290960 సంప్రదించాలని తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక లోహియా నగర్‌కు చెందిన పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. నిరుపేదలైన 20 కుటుంబాలకు చెందిన వారికి మునిరావు వీధిలోని సంస్థ కార్యదర్శి లయన్ కొండూరు జనార్దన రాజు కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పసల చిన్న వీరన్న మనవడు చి. హరి 11వ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పసల వీరయ్య, డేవిడ్ రాజ్, విజయ్ కుమార్ బాబు, గొబ్బూరి కోటేశ్వరరావు, సతీష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలపై డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కడప–పామూరు–కడప బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని విన్నవించారన్నారు. అలాగే కమలాపురంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బస్సులు నిలపాలని, ఎగువ రామాపురం హైస్కూలుకు వెళ్లేందుకు సరైన సమయంలో బస్సులు నడపాలని, వికలాంగుల వాహనాలను బస్టాండులో పార్కింగ్ చేసినపుడు ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారన్నారు. ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాల వద్ద బస్సులు నిలుపాలని, ఉదయం 6 గంటలకు చెన్నూరు నుంచి మైదుకూరుకు వెళ్లేందుకు తగినన్ని బస్సులు నడపాలని, ఉదయం 6.30 గంటలకు తిరుపతికి సర్వీసు నడపాలని, బద్వేలు– పోరుమామిళ్ల మార్గంలో సమయ పాలనలో బస్సులు నడపాలని కోరారన్నారు. ఇంకా పలు మార్గాలలో బస్సులు నడపాలని కోరారన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి


15వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


8వ డివిజన్‌లో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని జేసీఎస్ అధ్యక్షుడు పి. జయచంద్రారెడ్డి, పార్టీ నాయకులు ఎస్. సుబ్బారెడ్డి, 15వ డివిజన్ కార్పొరేటర్ కె.లక్ష్మీదేవి అన్నారు. బుధవారం స్థానిక రామాంజనేయపురంలోని ఎలక్ట్రికల్ కాలనీలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఈ రాష్ట్రాన్ని పద్నాలుగేళ్లపాటు పాలించిందని, కానీ ఈ జిల్లాను మాత్రం ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఈ జిల్లాలో అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే జరుగుతోందన్నారు. నగర శివారు ప్రాంతాల్లో కూడా సీసీ రోడ్లు, కాలువలు వచ్చాయంటే ఆయన వల్లేనన్నారు. గతంలో ఐదేళ్లు పాలించిన టీడీపీ ఈ జిల్లాకు రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. రెండేళ్లు కరోనా వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఏ ఒక్క టీడీపీ నాయకుడు తొంగి చూసిన పాపాన పోలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడే సరికి టీడీపీనాయకులు ఇంటింటికీ వచ్చి ఫోన్ నంబర్లు, ఓటీపీలు అడుగుతున్నారని...ఎవరూ చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీరారెడ్డి, లక్ష్మీప్రసన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

శంకరాపురంలో..

కడప నగరం 8వ డివిజన్లోని శంకరాపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీఎస్ అధ్యక్షుడు తోటక్రిష్ణ, జేసీఎస్ కన్వీనర్ మల్లికార్జున, 8వ డివిజన్ ఇన్‌చార్జి ఏ. బాలక్రిష్ణారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం వార్డు సచివాలయం వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' బుక్‌లెట్ అందజేసి గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాణాప్రతాప్, మాజీ కార్పొరేటర్ జమ్మిరెడ్డి పాల్గొన్నారు.

33వ డివిజన్‌లో..

స్థానిక 33వ డివిజన్‌లో 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, జేసీఎస్ అధ్యక్షుడు హరూన్ బాబు, జేసీఎస్ కన్వీనర్ ఎస్ఎండీ షఫీ, డివిజన్ ఇన్‌చార్జి గౌస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షంషేర్, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జడ్జి బాబా ఫక్రుద్దీన్ సూచించారు. బుధవారం కడప ఎర్రముక్కపల్లె గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో లీగల్ లిటరసీ క్లబ్‌ను సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అలాగే గుడ్ టచ్, స్నేహపూర్వక స్వభావం, సోదరభావం, దేశభక్తి మొదలకు అంశాల గురించి వివరించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరం అని అన్నారు. విద్యార్థులకు సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 108, 100, 1098, 14567, 15100 మొదలకు వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యసుజాతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

యువగళం.. ఓ టైంపాస్ పాదయాత్ర

జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ టైంపాస్ కోసం పాదయాత్ర చేశారని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన పాదయాత్రలకు ఓ చరిత్ర ఉందని, ఒక పార్టీకి అధ్యక్షులుగా ఉన్నవారు పాదయాత్రలు చేసి, అయా పార్టీలను అధికారంలోకి తీసుకురాగలిగారన్నారు. వాటన్నింటికీ భిన్నంగా లోకేష్ యువగళం పాదయాత్ర సాగిందని, ఆయన ఎప్పుడు కావాలంటే అప్పుడు మొదలు పెట్టి, ఎప్పుడు అవసరమైతే అప్పుడు బ్రేక్ తీసుకుంటూ ఈ యాత్ర చేశారన్నారు. చంద్రబాబు అరెస్ట్ అయినప్పుడు పాదయాత్ర ఆపి ఢిల్లీకి పారిపోయారన్నారు. ఆయన పాదయాత్ర మొదలుపెడితే తారకరత్న అప్పుడే అనారోగ్యానికి గురై చనిపోయారని గుర్తుచేశారు. ఎండాకాలంలో అయితే సాయంత్రం పూట మాత్రమే పాదయాత్ర చేసి, మిగిలిన సమయం టెంట్‌లలో విశ్రాంతి తీసుకునేవారన్నారు. వాళ్ల స్వార్థం కోసం, పబ్బం గడుపుకోవడానికి చేసిన పాదయాత్రకు విజయోత్సవ సభ నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. ప్రజల మేలు కోరే ఆత్మబంధువు సీఎం వైఎస్ జగన్ కావాలో.. ప్రజలను పీడించి పీక్కుతినే రాబందు చంద్రబాబు కావాలో ప్రజలు తేల్చుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, క్రిష్ణయ్య, కళాయాదవ్, మస్తానయ్య, షఫీవుల్లా పాల్గొన్నారు.

వైవీయూలో యువజనోత్సవాలు ప్రారంభం


మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో 'యువభేరి' పేరుతో నిర్వహిస్తున్న రెండురోజుల విశ్వవిద్యాలయస్థాయి యువజనోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సాంస్కృతిక విభాగం, స్టూడెంట్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల యువజనోత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు గెలుపోటములు ముఖ్యం కాదని, పోటీల్లో పాల్గొనడమే పెద్ద బహుమతి అని పేర్కొన్నారు. వైవీయూ స్థాయిలో విజేతలుగా నిలిచే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న నైపుణ్యాలను, కళలను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల సమన్వయకర్త ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వైవీయూ స్థాయిలో విజేతలకు 2024 జనవరి 5 నుంచి 9వ తేదీ వరకు వైజాగ్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగే దక్షిణ భారత విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వైవీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ మ్యూజిక్, డాన్స్, సంగీతం, సాహిత్యం, లలితకళలు, గాత్ర సంగీతం, వాద్య సంగీతం అంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లలిత కళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, న్యాయనిర్ణేతలు ఆచార్య పి. రమాదేవి, డా.మాదక్క, డా.రియాజున్నీసా, డా.సుమిత్ర, డా.వారిజ, డా.పార్వతి, లలిత కళల విభాగం అధ్యాపకులు, సాంకేతిక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం వైవీయూ వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన 5 బ్యాడ్మింటన్ కోర్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు రాకెట్స్, షటిల్ కాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఆర్వో, ఆర్డీఓ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని జిల్లా పరిషత్ భవనంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైటి క్రిస్మస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలు అందరి మధ్య జరుపుకోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీవో మధుసూదన్, క్రిస్టియన్ మైనారిటీ అధికారులు షేక్ ఇమ్రాన్, సీనియర్ అసిస్టెంట్ సి.హెచ్ డేవిడ్‌లతోపాటు పలువురు క్రైస్తవ గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.

క్రైస్తవులు దయ, క్షమా గుణాలకు మారుపేరు

కడప కల్చరల్ : క్రైస్తవులు దయా, క్షమాగుణాలకు మారుపేరుగా నిలుస్తున్నారని సెవెన్త్ డే ఎడ్వెంటిస్ట్ చర్చి ప్రెసిడెంట్ ఫాదర్ ఎంఎం శ్యాంసన్ అన్నారు. బుధవారం కడప నగరంలోని సెవెన్త్ డే ఎడ్వెంటిస్ట్ సంస్థ సెక్షన్ కార్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కడప, అన్నమయ్య, పుట్టపర్తి, అనంతపురం జిల్లాలలోని సంస్థ కార్యాలయంలో సేవలు అందిస్తున్న పాస్టర్లు, వారి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఫాదర్ జి.ఎలీసా, కోశాధికారి కె.రాంబాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

24న పుస్తకాల ఆవిష్కరణ

కడప కల్చరల్ : రచయిత ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి రచించిన రెండు పుస్తకాలను ఆదివారం ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆవిష్కరించనున్నారు. సూర్య ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రభాకర్‌నాయక్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్ రాజు, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబుల ఆధ్వర్యంలో ఈ పుస్తకాలను ఆవిష్కరిస్తారు. ఆచార్య ఈశ్వర్‌రెడ్డి రచించిన నాలో నవ్వు కవిత్వ పుస్తకం, సాహిత్యంలో సమాజం విమర్శన గ్రంథం ఈ సందర్భంగా ఆవిష్కరిస్తారు.

వేతన సవరణ చర్చలు జరపాలి

కడప కల్చరల్ : ఎల్‌ఐసీ యాజమాన్యం వేతన సవరణ చర్చలు తక్షణమే నిర్వహించాలని ఉద్యోగ సంఘాల జాయింట్ ఫ్రంట్ నాయకులు చంద్రపాల్, రఘునాథరెడ్డి, సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు అవదానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసనలో వారు మాట్లాడారు. డిసెంబర్ 11, 12 తేదీలలో చర్చలు అని ప్రకటించి, వాటిని వాయిదా వేయడంలో అంతర్యం ఏమిటని వారు నిలదీశారు. బ్యాంకింగ్ రంగంలో వేతన సంవత్సరం చర్చలు కొలిక్కి వచ్చాయని, ఎల్‌ఐసీలో వేతన సవరణ గడువు ముగిసి 17 నెలలైనా, ఇంకా చర్చలే ప్రారంభించకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్లారెడ్డి, అక్బర్ బాషా, సరళ వారిజాతమ్మ, మహేశ్వర్‌రెడ్డి, రాజు, కుమార్ పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించి ఆయా వర్గాలను ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద నాగరాజు కోరారు. బుధవారం స్థానిక పాత రిమ్స్ లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. అదేవిధంగా బీసీల జన గణన కేంద్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. బీసీలకు ప్రత్యేకంగా కేంద్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం నూతనంగా బీసీ సంక్షేమ సంఘం కడప పార్లమెంట్ అధ్యక్షులు రామాంజనేయులను సన్మానించారు. సమావేశానంతరం పాత రిమ్స్‌లో కొనసాగుతున్న బీసీ భవన్ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, బీసీ పార్లమెంటు అధ్యక్షులు బొర్రా రామాంజనేయులు, సలహాదారు ఖాదర్ బాష, బీసీ సీనియర్ నాయకులు కళ్య సుధాకర్, గురు స్వామి, మునిరత్నం గౌడ్, రామ్మూర్తి నాయుడు, నరసింహ, మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పరికరాలను అమర్చుకోవాలి

కడప అగ్రికల్చర్ : రైతులకు మంజూరైన డ్రిప్, స్ప్రింకర్లకు సంబంధించిన పరికరాలను త్వరగా అమర్చుకునేలా కంపెనీ ప్రతినిధులు చూడాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిసాగు పథకం ప్రాజెక్టు ఆఫీసర్ హరినాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని ఏపీ సూక్ష్మనీటి సాగు పథక పీడీ కార్యాలయంలో పీడీ రవీంద్రనాథరెడ్డి సమక్షంలో కార్యాలయ సిబ్బంది, జిల్లా కంపెనీ ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు మంజూరైన పరికరాలను కంపెనీ ప్రతినిధులు రైతులకు త్వరగా అందించాలని సూచించారు. అలాగే పరికరాలను కూడా బిగించునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, ఎంఐ ఇంజనీర్లు, ఎంఐడిసిలు, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం ముందస్తు జన్మదిన వేడుకలు


దైవ సేవకులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మేయర్ సురేష్ బాబు


సీఎం వైఎస్ జగన్ జన్మదిన సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న మేయర్ సురేష్ బాబు తదితరులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని శివశివానీ స్కూల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వి. నాగేంద్రారెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ వి. రమణిల ఆధ్వర్యంలో భారీ కేక్‌ను నగర మేయర్ సురేష్ బాబు, ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలు చిన్నారుల సమక్షంలో కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్‌క్రీం రవి, సుబ్బరాయుడు, ఎన్. సుబ్బారెడ్డి, శ్యాంసన్, రహీం, కిరణ్, మధువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ అధినేత జన్మదిన సందర్భంగా రక్తదానాలు, అన్నదానాలు, వస్త్రదానాలు వంటి సేవా కార్యక్రమాలు చేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపాలన్నారు.

దుస్తులు పంపిణీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చైతన్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ పి. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో దైవ సేవకులకు, పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ సురేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై వాటిని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికార్జున, పార్టీ నాయకులు కిరణ్, వీరారెడ్డి పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : కడప రాధాకృష్ణ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టినరోజు ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాష, హెచ్‌ఎం షబానా ఆజ్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– కడప నగరం జెడ్పీ కార్యాలయం వద్ద ఉన్న ప్రేమాలయం వసతిగృహంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ ముందస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్‌సీపీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు అహ్మద్‌బాషా సాజన్, ఆశ్రమ మేనేజర్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.